క్లుప్తంగా

ఘనంగా భగీరథ జయంతి



గుడివాడ టౌన్: భగీరథ మహర్షి జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. సగర సంఘం కార్యాలయం వద్ద గుడివాడ పుర పాలక సంఘ కాంట్రాక్ట్ కార్మికులు ఆధ్వర్యం లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆకాశ గంగను భూమిపైకి దించి ప్రజల దాహార్తిని, భూమి పచ్చదనాన్ని నింపిన మహానుభావుడు భగీరథుడని తెలిపిఆరు. గజ్జెల వెంకట నారాయణ, రెడ్డి ఆంకాలు, గండికోట ఆంజనేయులు, ధనుకొండ వీరాంజనేయులు, కగ్గా దుర్గారావు, బండారు కళావతి, బత్తుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బాబా ఆలయ వార్షికోత్సవం

మండవల్లి: మండలంలోని భైరవపట్నం షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో గురువారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా పండితుల వేదమంత్రాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రముఖులు చదలవాడ శేషగిరిరావు దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు.

రేపటి నుంచి వసంత సంబరాలు

మండవల్లి: మండలంలోని కానుకొల్లులో శనివారం నుంచి మే ఒకటో తేదీ వరకు వసంత సంబరాలు జరుగుతాయని నిర్వహణ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 29న ఉదయం 108 దేశీ ఆవులతో గోపూజ, మధ్యాహ్నం ఒంగోలు పెయ్య ఆవుల పుంగనూరు గోప్రదర్శన, సాయంత్రం విజేతల ఎంపిక, పాల పోటీల ప్రారంభం, 30న ఉదయం ఎడ్ల జత బండి పోటీల ప్రదర్శన, మధ్యాహ్నం కోడెల ప్రదర్శన, సాయంత్రం విజేతల ఎంపిక, మే ఒకటో తేదీన ఉదయం ఎడ్లజత స్వారీ బండి ప్రదర్శన, పాల పోటీల విజేతల ప్రదర్శన, ప్రదర్శనలో పాల్గొనే పాలపళ్ళ పెయ్య దూడలు, కోడె దూడలు, పాడి ఆవులు పేర్లు నమోదు, గోప్రదర్శన, విజేతల ఎంపిక, సాయంత్రం ప్రదర్శనలో రాణి, రాజు ఎంపిక, బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయని నిర్వహణ కమిటీ పేర్కొంది.

నర్సరీలో మొక్కల పరిశీలన

అడ్డాడ(పామర్రు): నర్సరీలో పలురకాల మొక్కలను పెంచుతున్నామని ఏపీవో పొలురాజు తెలిపారు. అడ్డాడలో నర్సరీని గురువారం ఆయన పరిశీలించారు. 25 గ్రామ పంచాయతీలలో 2,750 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లో ప్రస్తుతం పంట బోదె పూడిక తీత పనులు చేపట్టామని పేర్కొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



హనుమంత పురంలో భూమిపూజ చేస్తున్న శాసనసభ్యులు అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం హనుమంతపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు-నేడు పథకంలో రూ.69 లక్షలు మంజూరు చేయగా దాతలు రూ.51లక్షల ఇచ్చి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమని చెప్పారు. పాఠశాల తరగతి గదులు, ఆట స్థలం అభివృద్ధి చేయుటలో భాగంగా రూ.7.25 లక్షల విలువ గల 12 సెంట్ల స్థలాన్ని శ్రీ గోవింద రాజన్ వీ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ యుఎస్‌ఏ వంగిపురపు శారద ఇవ్వడం జరిగిందన్నారు. అంతే కాకుండా శారద తన తల్లి జ్ఞాపకార్థం రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.27లక్షల విరాళాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారన్నారు. హనుమంతపురం గ్రామస్తులు తమ వంతు కృషి చేసి రూ.4.83 లక్షల విలువ గల 8 సెంట్ల స్థలమును పాఠశాలకు అందించారని పేర్కొన్నారు. గ్రామ ప్రముఖులు ఔత్సాహికులైన పోరంకి వెంకటేశ్వరరాజు, శొంఠి వెంకటేశ్వరరావులు సుమారు రూ.12 లక్షల విలువ గల 20 సెంట్ల స్థలాన్ని పాఠశాలకు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. దీనిని విద్యార్థులు అందరూ అందిపుచ్చుకుని ఉన్నత విద్యా వంతులు కావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ కలపాల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల కన్వీనర్ యలమంచిలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ శివారు పెద్దగూడెంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని వర్గాలు నూరు శాతం సంతృప్తిగా ఉన్నాయన్నారు. అందరికీ ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. దేశ చరిత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేసిన ముఖ్యమంత్రి ఏ రాష్ట్రంలో లేరన్నారు. ఎంపీపీ గోగం సురేష్, జెడ్పీటీసీ మండవ దేదీప్య, ఎంపీటీసీలు జాజుల శ్రీనివాసరావు, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, సచివాలయ మండల కన్వీనర్ జాజుల చిన్నారి, సర్పంచ్‌లు అప్పికట్ల ఆశాజ్యోతి, ప్రత్తిపాటి హార్షవర్ధన్, పాతూరి రమేష్, పుణుకొల్లు శివరామప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మండవ జానక రామయ్య (మున్నా), తుమ్మల కోటేశ్వరరావు, జాపల్లిశేఖర్, మండల ఎస్ఐ పల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో కైకలూరు విద్యార్థుల ప్రతిభ

కైకలూరు: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎం.రవీంద్ర గురువారం చెప్పారు. మొత్తం 103 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయగా, వీరిలో 46 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సెకండ్ ఇయర్‌లో డి.హెడెన్ (ఎంపీసీ-959), సీహెచ్.బాల అనూషా (ఎంపీసీ-933), ఎస్.దీపికా (బైపీసీ-872), ఫస్ట్ ఇయర్‌లో జీ.తేజశ్వనీ (బైపీసీ-419), ఎం.బేబీ విట్నూస్(ఎంపీసీ-340), జి.మోజెస్ (బైపీసీ-353), సెకండ్ ఇయర్ సీఈసీ కామర్స్‌లో ఎం.శిరీషా(748), సీహెచ్.చినవెంకన్న (739), కె.మోహన్ లక్ష్మీ (683) మార్కులు సాధించి కాలేజీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. అదే విధంగా సెకండ్ ఇయర్ ఒకేషనల్ కోర్సులో కోట మహేష్‌బాబు, మానేపల్లి నాగ అభిరాం, ఫస్ట్ ఇయర్‌లో ఘంగసాల తనూజ, చిరాపు పావని, చేబోయిన హరిక, సంపర్తి జ్యోతి, చింతపల్లి స్వర్ణలు ప్రతిభ చూపారని చెప్పారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఇంటర్ పరీక్షల్లో 94 శాతం ఉత్తీర్ణత

గుడివాడ టౌన్: ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ ఫలితాలు సాధించారని శ్రీ చైతన్య ప్రిన్సిపల్ సీహెచ్ వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఈ ఫలితాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు జాజుల వంశీప్రియ, కొల్లి దవ్యలు 470 మార్కులకు గాను 465, ఇమ్మిడిశెట్టి కావ్యాంజలి, మాదిరెడ్డి హర్షలు 464 మార్కులు సాధించారని, రెండవ సంవత్సరం విద్యార్థులు జోగి నవ్యశ్రీ 988 మార్కులు, సొలసా జాహ్నవి, సంబంగి ఆశాజ్యోతి 986 మార్కులు సాధించారని పేర్కొన్నారు. మొత్తం కళాశాలలో 94 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు.

గుడ్డిగా వ్యతిరేకిస్తే గుణపాఠం తప్పదు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గుడ్డిగా వ్యతిరేకిస్తే గుణపాఠం తప్పదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని గ్రామాభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని సర్పంచ్ సహా టీడీపీ నేతలు కొందరు చేసిన విమర్శలపై సంధ్య గురువారం మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రతి గ్రామాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నిధులను కేటాయిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే పెదపాలపర్రు గ్రామాభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు చల్లగుల్ల బాబ్జి, బొప్పన ప్రసాద్, గంటా కోటేశ్వరరావు, చల్లగుల్ల శ్రీకాంత్, మెరుగుమాల వెంకటేశ్వరరావు, కల్యాణపు విష్ణు వర్ధనరావు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొరగుంటపాలెం శివారు రాజానగరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ స్థానిక నేతలు గురువారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన నాయుడు రామారావు, నారాయణరావుకు చెందిన ఇళ్లు దగ్ధం కాగా సర్వస్వం కోల్పోయారు. వీరికి రూ.25 వేలు వంతున ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ పేరే రామకృష్ణ, అల్లూరి సర్పంచ్ శీలం రామకృష్ణ, స్థానిక సొసైటీ అధ్యక్షుడు అచ్యుత రాంబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, బత్తిన కిషోర్, తాడంకి రాజేష్, దివి సతీష్, పేతు రాజా, తుమ్మా రామశాస్త్రి, శేషగిరి, పరసా శ్రీనివాసరావు, పేరం ధర్మరాజు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మండవల్లి: మండలంలోని భైరవపట్నం శివారు శోభనాద్రిపురంలో పీఎం జీవనజ్యోతి బీమా యోజన రూ.2 లక్షల చెక్కును గురువారం మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కృష్ణంరాజు 2020 సంవత్సరంలో పీఎంజెజెవై బీమా యోజన పథకంలో చేరాడు. రెండు వాయిదాలు చెల్లించి సహజ మరణం చెందాడు. ఇన్‌స్రూ ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు మేనేజర్ అందజేశారు. ఇదేవిధంగా మండవల్లి, అయ్యవారిరుద్రవరం, గన్నవరం, తక్కెళ్లపాడు గ్రామాల్లో వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అందించడం జరిగిందని దుర్గారావు పేర్కొన్నారు. సర్పంచ్ పి.సామ్రాజ్యవాణి, ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.కిరీటిరాజు, ఏబీఎం పద్మకుమారి, బి.రత్నకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరావు (నాని) పట్టణంలోని 3వ వార్డులో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందిపడాల్సిన అవసరత లేదన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. గుడివాడ పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల ద్వారా శాశ్వత గృహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు చేరువగా ఉంటున్నారని, ఏ సమస్య వచ్చినా సచివాలయాల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొల్ల శ్రీను, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహరావు, శ్రీనివాస చక్రవర్తి, చింతల భాస్కరరావు మహిళా కార్యకర్తలు, వార్డు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీపీ గద్దే పుష్పరాణి

గుడివాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడివాడ మండలాభివృద్ధికి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని చెప్పారు. గ్రామాల్లో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం రోజురోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండల కారణంగా తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండానే జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. డెప్యూటీ కలెక్టర్ కె.చైతన్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందే విధంగా ప్రజా ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఎంపీడీవో అనగాని వెంకటరమణ, వైస్ ఎంపీపీలు భట్టు నాగమల్లేశ్వరి, గుంజా వంశీదర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇన్‌చార్జి డీఈ అట్లూరి వెంకటేశ్వరరావు, విద్యుత్‌శాఖ మండల ఏఈ సురేష్, ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి ప్రజాప్రతినిధులకు వివరిస్తున్న డెప్యూటీ కలెక్టర్ చైతన్య

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

డెప్యూటీ కలెక్టర్ చైతన్య

గుడివాడరూరల్: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమర్థవంతంగా పని చేయాలని డెప్యూటీ కలెక్టర్ కె.చైతన్య పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం, రామనపూడి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్‌శాఖ అధికారులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. తొలుత రెండు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. ఆయా కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు ఎవరైనా లబ్ధిదారులు ఇంకా ఇళ్ల నిర్మాణాలను చేపట్టకపోతే వారికి అవగాహన కల్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డీఈ ఎం.రామోజీనాయక్, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ డి.పృథ్వీ, పంచాయతీ కార్యదర్శి ఆర్వి కృష్ణారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ టి.సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మకూరు గురుకుల పాఠశాలలో 84శాతం ఉత్తీర్ణత

నిమ్మకూరు(పామర్రు): ఏపీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఫలితాల్లో 84 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని నిమ్మకూరు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డి.మైసూర్ బాబు గురువారం తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో మొత్తం 118 మంది హాజరు కాగా వీరిలో 99 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఎంపీసీలో డి.అంజిరెడ్డి 968/1000, బైపీసీలో ఎస్.శివారెడ్డి 971/1000, ఎంఈసీలో ఎస్వీ మణికంఠ 888/1000, సీఈసీలో ఎస్‌కె నాజియా 903/1000 సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీల పి.లోహిత 455/470, బైపీసీలో బి.సౌమ్య 429/470, ఎంఈసీలో వైజీఎస్ ప్రవీణ్ 485/500, సీఈసీలో బి.పాల్ 474/500 సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారని చెప్పారు. పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 51 మందికి 23 మంది ఉత్తీర్ణులై 45 శాతం ఫలితాలు సాధించామని ప్రిన్సిపల్ అరుణకుమార్ తెలిపారు. అదే విధంగా మొదటి సంవత్సరంలో 41 మందికి 17 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారన్నారు.

3 నుంచి జగన్నాథస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీసుభద్రబలరామ సహిత జగన్నాథస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు వచ్చే నెల 3 నుంచి 8 వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ మత్రివాడ సుబ్బలక్ష్మి, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఉత్సవాలు ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా మే 4న స్వామివారిని పెండ్లికుమారుడిని చేసి పూజాదికాలు జరిపిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 4న రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం, 5న రథోత్సవం 6న బలిహరణ, ధ్వజావరోహణ, 7న పవళింపు సేవ, 8న అఖండ అన్నసమారాధన జరుగుతాయన్నారు.

బుర్రకథ ద్వారా సంక్షేమ పథకాలపై ప్రచారం

ముదినేపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బుర్రకథ రూపేణా కళాకారులు ప్రజలకు తెలియజేశారు. ముదినేపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ బుర్రకథ ద్వారా పలు సంక్షేమ పథకాల అమలు జరుగుతున్న తీరు ప్రజలకు ఒనగూరుతున్న లాభాలను వివరించారు. అదే విధంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. గుడివాడ రూరల్ మండలం బిల్లపాడుకు చెందిన కళాకారులు ఈ బుర్ర కథను ప్రదర్శించారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మరీదు నాగయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు, ఈడే ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



గుడివాడ టౌన్(నందివాడ): ఎండవేడిమి అధికంగా ఉండటంతో ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తమిరిశ సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నున్న నాగేశ్వరరావు, మద్దాల ఏసుపాదం, మద్దాల బాపూజి, తప్పిట సలోమన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక పోలీసుస్టేషన్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. మండల కేంద్రమైన ముదినేపల్లికి వచ్చే ప్రజలకు, స్థానిక బస్టాండ్‌కు వెళ్లే ప్రయాణికులకు ఈ చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ఎస్సై షణ్ముఖసాయి తెలిపారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సూచనల మేరకు ప్రతిరోజూ చలివేంద్రంలో సిబ్బంది ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా హెడ్‌కానిస్టేబుల్ రామారావు వితరణతో గురువారం మజ్జిగ పంపిణీ చేశామన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

పాలంకిపాడు(మొవ్వ): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఒంటి నిట్టాడి తాటాకు ఇల్లు అగ్నికి ఆహుతైంది. మొవ్వ ఫైర్ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు... మొవ్వ మండలం అవురుపూడి గ్రామానికి చెందిన కొమ్ము చంటికి చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఫైర్ అధికారి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.

రోడ్డుపై వర్షం నీరు మళ్లింపు

మండవల్లి: మండవల్లి సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీటిన సర్పంచ్ మెండా ఝాన్సీ పొక్లెయిన్‌తో సరిచేయించి నీరు బయటకు పోయేవిధంగా గురువారం చర్యలు తీసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోగా, స్టేషన్‌కు రాకపోకల్లో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ పి.నాగమల్లీశ్వరి సూచన మేరకు నీటిని బయటకు తరలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.